వైభవంగా తొలి ఏకాదశి

- భక్తులతో ఆలయాలు కిటకిట
- ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేసిన డీకే అరుణ

మల్దకల్: తొలి ఏకాదశి సందర్భంగా ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిట లాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటేష్, లవన్న, గోపాల్, నాగరాజు, ప్రకాష్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతినగర్: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి, రామాలయాలు, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామివారికి ప్రీతిపాత్రమైన తులసి మాలలు, ఫల, పుష్పాలు, నారికేళాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాజోళి: మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయమే తుంగభద్ర నదికి పాదయాత్రతో వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించి, నీటిని తీసుకుని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

మానవపాడు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమరవాయిలో పండితులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం, కోతులగిద్ద అరణ్యేశ్వర స్వామి ఆలయం, మాల్‌దొడ్డి సీతారామాంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గట్టు: మండల కేంద్రంతో పాటు మాచర్లలో తొలి ఏకాదశిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాండురంగ స్వామి ఆలయంలో, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు చేశారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సివిల్ జడ్జి కవితాదేవి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బండ్ల లక్ష్మీదేవి, భాస్కర్ రెడ్డి, బండ్ల చంద్రశేఖర్ రెడ్డిలు స్వామివారిని దర్శించుకున్నారు.

అయిజ: పట్టణంలోని అంబాభవానీ ఆలయంలో ఆషాడం తొలి శుద్ధ ఏకాదశి సందర్భంగా గురువారం రుక్మిణి, పాండురంగ స్వామి కల్యాణ్యాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భావసార క్షత్రియ సమాజం సభ్యులు పాల్గొన్నారు.



రాజోళిలో రామలింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఆదిశిలా క్షేత్రంలో డీకే అరుణను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్



శాంతినగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



ధరూరు పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో..



కేటీదొడ్డి పాగుంట లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో..



ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

త్యాగానికి ప్రతీక..

- భక్తిశ్రద్ధలతో బక్రీద్

అలంపూర్: నియోజకవర్గ వ్యాప్తంగా బక్రీద్ పండగను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా, మసీదులను ముస్తాబు చేశారు. సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం శుభాకాంక్షలు తెలిపారు.

అయిజ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బక్రీద్ పండగను నిర్వహించారు. ఈద్గాలు, మసీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. బంధు మిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఒకరికి ఒకరు బక్రీద్ పండుగ శుభాకాక్షలు తెలుపుకొన్నారు. పట్టణంలో ఎమ్మెల్యే అబ్రహం ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ధరూరు: త్యాగం, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ముస్లింలు ప్రత్యేక పార్థనలు చేశారు. మండల కేంద్రంతో పాటు ఉప్పేరు, ర్యాలంపాడు, మార్లబీడు, మన్నాపురం, నెట్టెంపాడు, చింతరేవుల తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు, పెద్దలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పలు గ్రామాల్లో బక్రీద్ పండగు సందర్భంగా ముస్లింలు ఈద్గా, మసీదులలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జామియా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ధార్మిక సందేశం ఇచ్చారు.

శాంతినగర్: వడ్డేపల్లి ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్ద రజాక్ మౌలానా ధార్మిక సందేశం ఇచ్చారు. త్యాగానికి ప్రతిరూపం బక్రీద్ పండుగ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం ఉదయం ముస్లింలు కొత్త దుస్తులు ధరించి ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సయ్యద్ రహ్మాన్, రఫీక్, ఖాజా, హనీఫ్, వెంకటేశ్వర్లు గౌడ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: త్యాగానికి ప్రతిరూపం బక్రీద్ అని మత పెద్దలు ధార్మిక సందేశం ఇచ్చారు. మండల వ్యాప్తంగా ముస్లింలు పండుగను ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతు, సర్పంచ్ ధనలక్ష్మి, రామకృష్ణారెడ్డి, గట్టు-1, 2 ఎంపీటీసీలు మహేశ్వరి, కృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌వాహాబ్, జాఫర్, మహబూబ్‌పాషా, నన్నేసాబ్, దస్తగిరి, ఖాజా, ఇస్మాయిల్, జుబేర్, రజాక్, బురానోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

కేటీదొడ్డి: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మత పెద్దలు పేర్కొన్నారు. ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



అయిజలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అయిజలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అబ్రహం



ఇటిక్యాల మండలం చాగాపురంలో..



ధరూరులో..



రాజోళిలో..



ఉండవెల్లిలోని మత పెద్దలతో గ్రామస్తులు



వడ్డేపల్లిలో..



ఉండవెల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గట్టులో..

క్లుప్తంగా

ఆదిశిలా క్షేత్రంలో డీఎస్పీ పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గద్వాల డీఎస్పీ రంగస్వామి, రిటైర్డ్ ఎస్పీ మాధవరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు మధుసూదనాచారి, అరవిందరావు వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతలను అర్చకులు డీఎస్పీ రంగస్వామికి వివరించారు. స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి ఆలయ మెమెంటోను అందజేశారు. అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, ధీరేంద్రదాసు, వాల్మీకీ పూజారులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని నల్లకుంట కాలనీకి చెందిన గోవర్ధన్ పని నిమిత్తం గద్వాల నుంచి ఎర్రవల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై గద్వాలకు వస్తున్న క్రమంలో రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నది. ఈ ఘటనలో గోవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అధికారుల నిర్లక్ష్యం



కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెంలో రెండు రోజుల నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి లీకేజీ అవుతూ తాగునీరు వృథా అవుతోంది. గ్రామంలోని రోడ్లపై మిషన్ భగీరథ నీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామ వీధులలో నీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. దీనికి తోడు మురుగు తోడవడంతో సమస్య మరింత జఠిలమైంది. దుర్గంధ వాసన భరించలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూన్ 29 నుంచి జూలై 4వ తేదీ వరకు మేరా బూత్ సబ్సే మజ్బూత్(నా పోలింగ్ బూత్ పటిష్టమైనది) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 12 మండలాల్లో 592 పోలింగ్ బూత్‌లు, 192 శక్తి కేంద్రాలు బలోపేతం చేయడానికి 16 మంది అల్పకాలిక విస్తారక్‌లు ఐదు రోజులపాటు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తారని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమల రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమసేనరావు, భగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వేములలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిది సంవత్సరాలు పుర్తి చేసుకున్న సందర్భంగా జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా కర్ణాటక విస్తరక్ మంజునాథ్ హాజరై నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం వివిధ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేకేరెడ్డి, మాణిక్యరెడ్డి, అశోక్‌కుమార్, శారద, శివ, నవీన్, మహేష్, తదితరులు ఉన్నారు.



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

రూ.3 కోట్లతో వ్యక్తి పరార్?

- అధిక వడ్డీ ఇస్తామని డబ్బులు వసూలు
- ఉండవెల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఘరానా మోసం

ఉండవెల్లి: అధిక వడ్డీ పేరుతో రూ.1 లక్షకు రూ.2 లక్షలు ఇస్తానని నమ్మబలికించి ఓ వ్యాపారీ కుచ్చు టోపి పెట్టాడు. విషయం తెలుసుకున్న బాధితులు గురువారం అతిడికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

● మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి గతంలో బ్యాంకులో ఫైనాన్స్ కట్టించుకుంటుండే వాడు. ప్రస్తుతం అధిక వడ్డీల పేరుతో డబ్బులు వసూలు చేసుకుని కొందరికి అధిక వడ్డీ ఇచ్చేవాడు. ముందు రూ. లక్ష కడితే నెలకు రూ.7 వేలు, రూ.5 వేలు ఇస్తామని నమ్మకం పెంచాడు. వారికి నమ్మకం కలిగాక, వారి నుంచి మరికొందరితో ఇన్వెస్ట్‌మెంట్ చేయించాలని కోరేవాడు. అతడిని నమ్మిన కొందరు వారి బంధువులు, చుట్టు పక్కల వారితో ఇన్వెస్ట్ చేయించారు. అతని ఇంటిని అద్దెకు ఇచ్చి, పైన ఉన్న ఇంట్లో ఉండే వారని సమాచారం. కొద్ది రోజుల నుంచి అతను, అతని భార్య, కుమారులు కనబడటంలేదు. ఇల్లు తాళం వేసి ఉంది. నాలుగు నెలలుగా కొందరికి అందుబాటులో లేకపోవడంతో ఆ గ్రామానికి చెందిన బాధితులు కలుసుకుని సదరు వ్యక్తి కనబడటం లేదని, ఫోన్ చేసినా స్పందించడంలేదని ఆందోళన చెందుతున్నారు. ఆ గ్రామానికి చేరుకుని వివరాలను సేకరించడంతో వ్యక్తి దాదాపు రూ.1.30 కోట్లతో పరారీలో ఉన్నట్లు సమాచారం. అదే గ్రామానికి చెందిన బాధితులు రూ.50 లక్షలు ఇన్వెస్ట్‌మెంట్ చేసినట్లు సమాచారం. ఒక్క మండలమే కాకుండా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన బాధితులు 50, నుంచి 60 మంది వరకు ఉంటారని, దాదాపు రూ.3 కోట్ల వరకు టోకరా వేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ బాల్‌రాజును వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

కొనసాగుతున్న భాగవత పారాయణం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో గురువారం భాగవత పారాయణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శిష్య బృందం సభ్యులు ఆరో రోజు ఆలయంలో మాదాంధ్ర భాగవత సప్తాహం చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, వెంకట్‌రెడ్డి, సత్యప్రకాష్ రావు, ధర్మారెడ్డి, రవీంద్ర, హరిరామన్న, సంజీవయ్య, అర్చకులు, భక్తులు, తదితరులు ఉన్నారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు



శాంతినగర్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ పైపాడులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గ్రామస్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. అదేవిధంగా గ్రామ దేవతలు సుంకులమ్మ, మారెమ్మ, వాల్మీకి గుడి, బొడ్రాయి, ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, యూత్ ఫర్ పబ్లిక్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వి శేషు, ఉపాధ్యక్షుడు బైరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

కౌన్సిలర్ మాతృమూర్తికి నివాళి

అయిజ : పట్టణంలోని 3వ వార్డు కౌన్సిలర్ గిత్తల దేవరాజు తల్లి ఆనందమ్మ మృతదేహానికి గురువారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌పూల మాల వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ గిత్తల దేవరాజును, కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంత్యక్రియలకు హాజరయ్యారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్

అయిజ: మండలంలోని వెంకటాపురంలో బక్రీద్ పండగ సందర్భంగా వెంకటాపురం, కిష్టాపురం గ్రామాలకు సంబంధించిన కబ్రస్తాన్ ప్రహరీ నిర్మాణానికి సంగారెడ్డి జిల్లాకు చెందిన శ్రీనివాస్ రూ.2 లక్షలు విరాళం అందజేశారు. గురువారం మసీద్ కమిటీ సభ్యులకు నగదును ఆయన అందజేశారు. అనంతరం దాతను సన్మానించారు. ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, తిమ్మన్న, పాల్గొన్నారు.

పురాతన విగ్రహాలు లభ్యం?

గద్వాల క్రైం: పట్టణంలోని కృష్ణానది రోడ్డు మార్గం సమీపంలో రాజుల కాలం నాటి బావిలో పురాతన విగ్రహాలు లభ్యమైనట్లు విశ్వసనీయ సమాచారం. 20 రోజుల నుంచి బావిలో పూడికతీత పనులు చేపట్టారు. అయితే గురువారం సాయంత్రం బావిలో నంది విగ్రహం, శివలింగ విగ్రహాలు బయటపడినట్లు తెలిసింది. విగ్రహాలను స్థానిక మున్సిపల్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పురాతన విగ్రహాలు కావడంతో అధికారులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

సాయిచంద్‌కు ఘన నివాళి



ఎర్రవల్లి కూడలిలో సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



గద్వాలలో సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



శాంతినగర్‌లో దివంగత సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల: తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మరణంపై బీఆర్ఎస్ నేతలు, కళాకారులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యమకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాయిచంద్ ఆకస్మిక మరణం అందరినీ కలిచివేసింది. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాయిచంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిచంద్ మరణంతో తెలంగాణ సమాజం గొప్ప గాయకున్ని, కళాకారున్ని కోల్పోయిందన్నారు. రాష్ట్ర సాధనలో సాగిన సాంస్కృతిక ఉద్యమంలో సాయిచంద్ పాత్ర కీలకమన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సాయిచంద్ చిత్రపటానికి కళాకారులు, విద్యార్థి సంఘ నాయకులు, ఉద్యమకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మధుసూదన్‌బాబు, రాజు, ప్రసాద్, తిరుమలేష్, ప్రతాప్, లక్ష్మీనారాయణ, మన్యం, దానయ్య, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. సాయిచంద్ హఠాన్మరణం పట్ల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఒక గొప్ప గాయకుడిని, భవిష్యత్ నాయకున్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ అమరవీరుల స్థూపం ఎదుట ప్రముఖ గాయకుడు, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ సాయిచంద్ చిత్రపటానికి తెలంగాణ ఉద్యమ నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు గార్లపాడు భూషణం మాట్లాడుతూ గొప్ప కళాకారుడిని కోల్పోయమన్నారు. చిన్నవయసులోనే గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. పాటల ద్వారా తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అలంపూర్ : తెలంగాణ సమాజంలో కళాకారునిగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సామాజిక ఉద్యమ గాయకుడు సాయిచంద్ పాట ప్రజల గుండెల్లో ఎప్పుడు సజీవంగా ఉంటుందని ప్రజానాట్య మండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అలీఅక్బర్, కార్యదర్శి ఆశన్నలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిచంద్ హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని వివరించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

పార్టీకి తీరనిలోటు

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన పాట మాట ద్వారా జనాన్ని చైతన్య పరిచిన సాంస్కృతిక యోధుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని ఎంపీపీ స్నేహ అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సాయిచంద్‌కు కన్నీటి నివాళి అర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ సాయిచంద్ 14 ఏండ్ల వయస్సు నుండే సామాజిక గీతాలు పాడారన్నారు. పాలమూరులో కృష్ణా, తుంగభద్ర జీవనదులున్నా ఆకలి చావులు ఎందుకున్నాయని తన పాటల ద్వారా పాలకులను ప్రశ్నించాడన్నారు. కార్యక్రమంలో నాయకులు కావలిమణ్యం, రవీందర్‌రెడ్డి, సుదాకరెడ్డి, రాగన్న, శ్రీధర్‌రెడ్డి, కోటిరెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మన్న, భాస్కర్, రాములు, శంకర్, వీరబాబు, తదితరులు ఉన్నారు.